న్యూస్ బాక్స్

లీప్ యాప్ ద్వారా హాజరు నమోదు : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లీప్ యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు డీఈవో శామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడితో నిర్ణీత సమయంలోగా తప్పకుండా లీప్ యాప్ ద్వారా ఫేషియల్ అటెండెన్స్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : వీసీ



మాట్లాడుతున్న ఉప కులపతి

కర్నూలు అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరం ఉండాలని ఆర్‌యూ ఉప కులపతి వి. వెంకట బసవరావు అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల కారణంగా యువత నిర్వీర్యమౌతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రకరకాల ఆకర్షణలకు లోనై బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. వర్సిటీ క్యాంపస్‌లో డ్రగ్స్‌కు స్థానం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత వర్సిటీ వర్గాలపై ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, డీన్‌లు సుందరానందపుచ్చా, భరత్ కుమార్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లమలలో కళ్లుగప్పి రూ. కోట్లు కొట్టేశాడు..!

నల్లమల.. ఓ అందాల అటవీ ప్రాంతం. చెంచులు, జింకలు, అరుదైన పక్షి జాతులు... లెక్కలేనన్ని చిరుతలు, పెద్దపులులకు ఆవాసం నల్లమల అభయారణ్యం. ఇంతటి సువిశాలమైన అటవీ సంపద ఉన్న నల్లమలలో అవినీతి, అక్రమాలకూ కొదువలేదు. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఓ ఇంటి దొంగ వ్యవహారం కలకలం రేపుతోంది. ఐఎఫ్ఎస్ స్థాయి అధికారులను సైతం కళ్లుగప్పి దర్జాగా కొట్లు కొట్టేశాడు. ఇందులో ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యం అడుగడుగునా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఈ తతంగం కేవలం శాఖాధిపతులకే తప్ప ప్రభుత్వం దృష్టికి వెళ్లనట్లు లేదు. దీని వల్ల విచారణ సైతం మందకొడిగా సాగుతోంది.



చాంద్‌బాషా

- అటవీశాఖలో ఓ ఉద్యోగి చేతివాటం
- విచారణలో విస్తుపోయే నిజాలు
- ఇప్పటికే రూ.4.35కోట్ల కాజేసినట్లు గుర్తింపు..?
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ స్వాహా
- కొరవడిన ఐఎఫ్ఎస్‌ల పర్యవేక్షణ
- ఆరుగురితో అటవీశాఖ ప్రత్యేక విచారణ
- పరారీలో నిందితులు

ఆత్మకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఎన్నో ఏళ్లగా అకౌంట్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చాంద్‌బాషా 2024 జూలైలో ఉద్యోగ విరమణ పొందాడు. అయితే ఆయన పని చేసినంత కాలం అంతులేని అక్రమాలకు పాల్పడ్డాడు. వచ్చే జీతం సరిపోలేదో.. ఏమోకానీ కంచె చేను మేసినట్లుగా అటవీశాఖకు వచ్చే ఆదాయంపై కన్నేసి కోట్ల రూపాయలు కొట్టేశాడు. ప్రత్యేకించి ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి, శిఖరం, లింగాలగట్టు ఫారెస్ట్ చెక్‌పోస్టుల నుంచి ప్రతినెల రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూళ్లవుతోంది. ఈ మొత్తాన్ని రోజువారీగా ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పేరిట బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. నెల రోజులు పూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్)కు బదలాయింపు చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసే వ్యవహారంలో చాంద్‌బాషా చేతివాటం ప్రదర్శించేవాడు. ఒక నెలలో వచ్చిన మొత్తాన్ని ఒకే చెక్కు ద్వారా కాకుండా మూడు, నాలుగు చెక్కులుగా వేరుచేసి అందులో కొన్ని చెక్కులను తన అవసరాల కోసం దారి మళ్లించుకున్నాడు. ఇందులో భాగంగానే 2024 మార్చి, ఏప్రిల్ నెలలో రూ.1,85,793, రూ.17,40,200 విలువ గల రెండు చెక్కులను తమ బంధువులకు సమీప సంబంధించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు మళ్లించి స్వాహా చేశాడు. ఈ విషయాలను సాక్ష్యాత్తు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా వెల్లడించారు. కాగా డివిజన్‌లో అటవీ చెక్‌పోస్టులు 2016 నుంచి ప్రారంభం కాగా అప్పటి నుంచే చాంద్‌బాషా ఈ తరహాలో నిధుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది.


బాగోతం బయటపడిందిలా...

ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేసి ఎవరూ.. ఇక్కడికి బదిలీపై రాకుండా జాగ్రత్తపడిన చాంద్‌బాషా ఎట్టకేలకు 2024 జూలైలో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత కూడా కొంతకాలం గౌరవవేతనంతో ఇక్కడే పనిచేయాలని ప్రయత్నించినప్పటికీ అది కుదరలేదు. ఈయన స్థానంలో విశాఖపట్నం నుంచి చంద్రశేఖరరాజు ఇక్కడికి వచ్చారు. అయితే చాంద్‌బాషా అతితక్కువ రికార్డులు అందించడంతో అతనికి అనుమానం వచ్చింది. తొలుత 2024 మే, ఏప్రిల్ నెలలవి పరిశీలించగా అందులో ఏకంగా రూ.20లక్షల వరకు అవకతవకలు చోటుచేసుకున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లోతుగా దర్యాప్తు చేయగా ఇప్పటి వరకు రూ.4.35కోట్ల అవినీతి వెలుగు చూసింది.

చెక్కులో పేరు ఒకటి.. అకౌంట్ నంబర్ మరొకటి

అకౌంట్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న చాంద్‌బాషా చాలా తెలివిగా తన అక్రమాలను కొనసాగించాడు. ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ బ్యాంకు ఖాతాకు జమచేసిన మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్), ఫారెస్టు డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఏ) తదితర సంస్థలకు ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసేవారు.

మిగతా 6వ పేజీలో



పేరొకటి.. అకౌంట్ నంబర్ మరొకటి ఉన్న చెక్

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కర్నూలు పోక్సో కోర్టు సంచలన తీర్పు

కర్నూలు లీగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా బనగానపల్లె పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబు గురువారం తీర్పు సంచలన తీర్పు చెప్పారు. 2020 అక్టోబరు 22వ తేదీన బాలికను నిందితుడు అత్యాచారం చేశాడు. ఈకేసులో నిందితుడిపై అప్పటి డోన్ డీఎస్పీ నరసింహారెడ్డి చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల కారాగారశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జరిమానా మొత్తాన్ని బాధిత బాలికకు చెల్లించాలని న్యాయాధికారి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

కార్మికులకు బెదిరింపులు

- సమ్మె విరమించకపోతే తొలగిస్తామని హెచ్చరికలు
- 45 రోజులుగా పురపాలక ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమ్మె విరమించకపోతే విధుల నుంచి తొలగిస్తామని ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులను నగరపాలక సంస్థ అధికారి బెదిరించారు. నగర పాలక పరిధి లోని ఇంజనీరింగ్ విభాగం కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 45 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే విధులు నిర్వహించకుండా కార్మికులు పూర్తిస్థాయిలో సమ్మెలోకి వెళ్లడంతో నగర ప్రజలకు తాగునీరు, విద్యుత్ దీపాలు, పార్కుల్లో పరిశుభ్రత మొదలైన విషయాల్లో ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎలాగైనా విధులకు హాజరు కావాలని, లేని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరికలు, నోటీసులు జారీ చేస్తున్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో ఓ అధికారి కార్మికులను తన చాంబర్‌కు పిలిపించుకుని బెదిరించారు. వెంటనే విధుల్లో చేరకపోతే కొత్త వ్యక్తులను నియమిస్తామని హెచ్చరించారు.

గంజాయిపై ఉక్కుపాదం

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి జిల్లాలో నార్కోటిక్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు అయ్యాయని, ముఖ్యంగా గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని కుడా చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, రైతులతో కలిసి పరివర్తన పేరిట సమావేశాలు నిర్వహించి గంజాయి నిర్మూలనలో ప్రజల్ని భాగస్వామ్యం చేసే కార్యక్రమం చేపడతామని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం గంజాయిప్రదేశ్‌గా మారిపోయిందని అన్నారు. విద్యాసంస్థల్లోనే గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు గతంలో ఎన్నో వెలుగులోకి వచ్చిన సంగతి ప్రజలకు తెలుసన్నారు.

నిధుల మాయాజాలం

- నగర పాలక సంస్థలో మరమ్మతుల పేరిట రూ.లక్షల్లో ఖర్చు
- చేసిన చోటనే మళ్లీ పనులు
- శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచించని అధికారులు



బంగారుపేటలో కాలువలు నిర్మిస్తుంటే తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్న దృశ్యం



కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని పైప్‌లైన్ లీకేజీల వ్యవహారం అంతుచిక్కడం లేదు. ఒకసారి పైప్‌లైన్ లీకేజీ కాగానే మరమ్మతులు చేస్తున్నారు... ఆ తర్వాత మళ్లీ అక్కడే నెలకే లీకేజీ అవుతున్నది. ఎందుకలా జరుగుతున్నదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమాధానం చెప్పేవారెవరూ లేరు. వెరసి నగరంలో పైప్‌లైను లీకేజీ సర్వసాధారణం అయిపోయింది. నిత్యం ఎక్కడో ఒక్కచోట పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. నీరు వృథా అవుతోంది. మరమ్మతులు చేసినప్పుడల్లా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చేపిస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదా? అనే సందేహం కలుగుతోంది. నగర పాలక సంస్థ మాయాజాలం అంతుచిక్కడం లేదు.

నగరంలోని 52 వార్డుల్లో 7 లక్షల జనాభా ఉంది. సుమారు 36 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. ప్లంబర్లు, ఫిట్టర్లు కలుపుకుని సుమారు 100కు పైగా సిబ్బంది తాగునీటి విభాగంలో పని చేస్తున్నారు. అధికారులు తమకు తెలిసిన వ్యక్తులను పిలిపించుకుని లైన్‌మెన్ల సహాయంతో మరమ్మతు చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్లకు పెద్ద ఎత్తున మరమ్మతు చేయించాల్సి వస్తే నిపుణులను రప్పించాలి. శాశ్వత ప్రాతిపదికన పని చేయాలంటే నిపుణులు తప్పనిసరి. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచించడం లేదు. ఎక్కడికక్కడ నిత్యం మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తూ నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రతి నెలా సుమారు నగరంలో 5 నుంచి 10 వరకు మరమ్మతు పనులు చేస్తున్నట్లు సమాచారం. వీటికిగాను రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం.

లీకులతో సరి..: నగరంలో గత కొన్ని నెలలుగా పైప్‌లైన్ లీకేజీల సమాచారాన్ని అధికారులకు చేరవేయడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నగర పాలక కార్యాలయంలో ఫిర్యాదుల విభాగానికి వారంలో మూడు ఫిర్యాదులు లీకేజీల గురించి వస్తున్నట్లు తెలుస్తోంది. లీకేజీల కారణంగా రహదారులపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. లీకేజీల కారణంగా తవ్విన గుంతలను పూడ్చి రహదారి మరమ్మతు పనులు ఆలస్యంగా చేస్తున్నారు. పనులు సరిగ్గా చేయక పోవడంతో మళ్లీ..మళ్లీ మరమ్మతు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాణ్యత లేని పనులతో నిధులు వృథా అవుతున్నాయని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఔట్‌డోర్ స్టేడియం వెళ్లే రహదారిలో పైప్ లైన్ లీకేజీ అయింది. రహదారిపై నీరు పారుతోంది. గత కొన్ని రోజులుగా సమస్య ఇలానే ఉన్న అధికారులు పట్టించుకో వడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఎప్పటికప్పుడు లీకేజీలకు మరమ్మతు చేస్తున్నాం

నగరంలో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతు చేస్తున్నాం. ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులు ప్రస్తుతం సమ్మెలో ఉన్నారు. దీంతో పనులు చేయడానికి సమయం పడుతుంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

- శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ

శానిటరీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో 2025-2026 సంవత్సరానికి ట్రేడ్ లైసెన్సు వసూళ్లలో నిర్లక్ష్యం వహించినందుకు 17 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 132 మంది శానిటరీ సెక్రటరీలకు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు గురువారం షోకాజు నోటీసులు జారీ చేశారు. నగరపాలక పరిధిలోని 52 వార్డుల్లోని వివిధ దుకాణ, వ్యాపార సముదాయాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, హోటల్స్, రెస్టారెంట్లు వంటివి సుమారు 11,410 ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 6591 మాత్రమే ట్రేడ్ లైసెన్సు వసూలు చేశారు. 4819 పెండింగ్‌లో ఉన్నాయి. పాతబకాయిలు రూ.2,73,85,320 ఉండగా ప్రస్తుతం సంవత్సరానికి రూ.53,31,889 ఉన్నాయి. మొత్తానికి రూ.3,27,17,209 ట్రేడ్ లైసెన్సు వసూళ్లు చేయాల్సి ఉంది. వసూళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం వహించినందుకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు తీసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు మూడు రోజుల్లోగా సరైన వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

స్వర్ణరథంపై ఆది దంపతులు



ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఆది దంపతులు మల్లికార్జున, భ్రమరాంబికాదేవి స్వామి, అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు ఉదయం మహన్యాసకపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణరథంపై ఉంచి రథోత్సవం నిర్వహించారు.

- శ్రీశైలం(ఆంధ్రజ్యోతి)

స్వర్ణ రథాన్ని లాగుతున్న భక్తులు

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

- డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- కర్నూలు నగరంలో భారీ ర్యాలీ
- పాల్గొన్న కలెక్టర్, ప్రజా ప్రతినిధులు

7

రైతుల కష్టాలు తీర్చండి

- పంట సాగుకు అధిక మొత్తం రుణాలు ఇవ్వాలి
- వ్యవసాయ రుణాలు రూ.6,162.06 కోట్లు అందించాలని బ్యాంకులకు కలెక్టర్ ఆదేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టాలు తీరేలా ఉదారంగా రుణాలు అధిక మొత్తంలో ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషా బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని బ్యాంకుల అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు వివిధ రంగాలకు ఈ సంవత్సరం అందించాల్సిన రుణ ప్రణాళికను వివరించారు. అన్ని రంగాలకు కలిపి రూ.17,412.86 కోట్లు లక్ష్యంగా నిర్ణయించామని, గత సంవత్సరంతో పోలిస్తే 15.49 శాతం ఎక్కువ అని కలెక్టర్ తెలిపారు. ఇందులో వ్యవసాయానికి ఖరీఫ్ రుణాలు రూ.3,635.62 కోట్లు, రబీ వ్యవసాయ రుణాలు రూ.2,526.44 కోట్లు అందించాలని అన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో మొత్తం వ్యవసాయ రుణాలు రూ.6,162.06 కోట్లు అందించాలనే లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. గత సంవత్సరం లక్ష్యానికి మించి రైతులకు రుణాలు అందించినందుకు బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. వ్యవసాయంతో పాటు మౌలిక సదుపాయాలకు రూ.39.24 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కోసం రూ.560.38 కోట్లు ఈసారి అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఇతర రంగాలకు సంబంధించి మైక్రో, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.3,570.63 కోట్లు అందించాలని, విద్యారుణాలను రూ.80.26 కోట్లు, హౌసింగ్ రుణాలు రూ.200.81 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాల కోసం రూ.3.16 కోట్లు, పునరుత్పాదక శక్తి కోసం రూ.94.33 కోట్లు, ఇతర రంగాలకు రూ.688.31 కోట్లు మొత్తం ప్రాధాన్యత రంగాలకు ఈ సంవత్సరం రూ.13,601.72 కోట్లు అందించాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మెప్మా పీడీ నాగశివలీల, ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజ మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలతో నష్టాల నుంచి గట్టెక్కండి - రైతులకు కలెక్టర్ విజ్ఞప్తి:

ప్రకృతి వైపరీత్యాల వల్ల సాగు చేసిన పంటలు దెబ్బతినకుండా నష్టాల నుంచి గట్టెక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో 26 పంటలకు వాతావరణ పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయబోతుందని తెలిపారు.

నేత్రరక్ష..!

- ఆరోగ్యకరమైన దృష్టికి కళ్లద్దాలు కీలకం
- నేడు జాతీయ సన్ గ్లాసెస్ దినోత్సవం



పాణ్యం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నది నానుడి కాదు నగ్నసత్యం. శరీరంలో అతి సున్నితమైన భాగాల్లో నేత్రాలు ప్రధానమైనవి. ప్రపంచాన్ని చూపెట్టే కళ్లను మనం కూడా అంతే జాగ్రత్తగా కాపాడుకోవాలి. కళ్లను కాపాడుకోవడంలో ప్రధాన భూమిక పోషించేవి కంటి అద్దాలు. నేటి ఎలక్ట్రానిక్ వస్తువుల అవసరాలు, అలవాట్లతో చిన్నవయసులోనే దృష్టిలోపాలు పెరుగుతున్నాయి. అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడే కళ్లద్దాలపై అవగాహన కల్పించడానికి ప్రతి యేటా జూన్ 27 వ తేదీన జాతీయ సన్‌గ్లాసెస్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. విజన్ కౌన్సిల్ ద్వారా సన్‌గ్లాసెస్ దినోత్సవానికి జీవం పోసింది. కళ్ల రక్షణకు కళ్లద్దాల ప్రాముఖ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దినాన్ని ఏర్పాటు చేసింది. కంటి వ్యాధులు, ప్రమాదాలు తగ్గించడానికి కళ్లద్దాలు ఎంతో ప్రాముఖ్యనిస్తాయి. ప్రకాశవంతమైన సూర్యరశ్మి నుంచి కళ్లకు ఉపశమనం కలిగిస్తాయి. కంటి అలసట, అసౌకర్యాన్ని తగ్గిస్తాయి.

పొలాల్లోనే పొగాకు

- ధర లేక రైతుల కష్టాలు



ఎర్రగుంట్ల పొలాల్లో టార్పిన్ పట్టాల కింద కప్పి ఉంచిన పొగాకును చూపిస్తున్న రైతులు

బండి ఆత్మకూరు జూన్26(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ళు లేకపోవడంతో రైతులు పొలాల్లో, గోదాముల్లో, ఇళ్ళలోనే నిలువ చేశారు. సుమారు ఐదు నెలల పాటు కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. ఎకరం పొలం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేసి కొందరు రైతులు, ముందుగానే కౌలు చెల్లించి ఇంకొందరు రైతులు మండలంలోని ఎర్రగుంట్ల, పెద్దదేవళాపురం, సంతజూటూరు గ్రామాల్లో పొగాకు పంటను సుమారు 3వేల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష మేర పెట్టుబడులు పెట్టారు. ఆకుకు పొగ పెట్టేందుకు కర్రలతో, పట్టాలు కప్పిన షెడ్లు వేసి, నెల రోజుల పాటు పొగబెట్టి పొగాకు తోరణాలు దించారు. అమ్మకం సమయానికి బేలు (100కేజీ) రూ.4వేల నుచి రూ 7వేల వరకు పలికింది. గతంలో బేలు రూ.13000 దాకా కంపెనీలు కొన్నాయి. ఇప్పుడు ఘోరంగా ధర పడిపోయిందని రైతులు అంటున్నారు.

అప్పులు తీరవు

ఈ ఏడాది నేను 8.50 ఎకరాల్లో పొగాకు పండించాను. పొగాకు త్వరగా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయకపోతే అప్పులు తీరవు. వర్షం వస్తే పొలాల్లో ఉన్న పొగాకు తడిసిపోయే ప్రమాదం ఉంది. కంపెనీలు ప్రభుత్వం సూచించిన మేరకైనా రూ.12500 చెల్లించి కొనాలి.

\- జయరాణి, రైతు

ప్రభుత్వమే కొనాలి

ఐదెకరాల్లో పొగాకు సాగు చేశాను. ఎకరానికి రూ. లక్ష మేర అప్పు చేశాను. పంట చేతికి వచ్చి రెండు నెలలైనా కొనడం లేదు. ఆకు మండె తిప్పటం, పొగాకు బేళ్ళు నంద్యాలకు తీసుకెళ్తే తేమ ఉందని తిరిగి పంపించారు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనాలి.

\- దస్తగిరి, రైతు

నల్లమలలో కళ్లుగప్పి రూ.కోట్లు కొట్టేశాడు..!



ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

ఈక్రమంలో చెక్కుపై ఫలానా సంస్థ పేరును బ్యాంకు అకౌంట్ నంబర్ స్థానంలో తనవాళ్లకు చెందిన ఇతర బ్యాంకు అకౌంట్ నంబర్లను రాసేవాడు. ఇది గమనించని డ్రాయింగ్ ఆఫీసర్లు చెక్కుపై సంతకాలు చేయగా ఆ తర్వాత ఆర్టీజీఎస్ ఫారమ్‌పై కూడా పేరు ఒకటి.. అకౌంట్ నంబర్ మరొకటి రాసి ఆఫారమ్‌పై ఆయనే సంతకం చేసి దర్జాగా తన బినామీ వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు అటవీశాఖ సొమ్మును మళ్లించాడు. అయితే నగదు బదిలీకి సంబంధించిన నెఫ్ట్ ఫారమ్‌లో కూడా అధీకృత అధికారి(డిప్యూటీ డైరెక్టర్) సంతకం ఉండాలని తెలిసింది. కానీ ఆ స్థానంలో చాంద్‌బాషా సంతకం చేసినప్పటికీ అవేమి పరిగణలోకి తీసుకోకుండా యూనియన్ బ్యాంకు అధికారులు నగదు బదిలీ చేయడం గమనార్హం. ఇదిలావుంటే యూనియన్ బ్యాంకు నుంచి అదే బ్యాంకుకు నగదు బదిలీ చేస్తున్న సందర్భంలో మాత్రమే అకౌంట్ వివరాలు కనిపిస్తాయి. యూనియన్ బ్యాంకు నుంచి ఇతర బ్యాంకులకు బదిలీ చేసినట్లయితే యూనియన్ బ్యాంకు సైట్‌లో ఖాతా వివరాలు కనిపించవు. ఇదేఅదునుగా చాంద్‌బాషా యూనియన్ బ్యాంకు నుంచి ఇతర బ్యాంకులను సొమ్మును బదిలీ చేస్తూ వచ్చాడు.

అడ్డగోలుగా అటవీ సొమ్ము మళ్లింపు

అటవీశాఖకు సమకూరిన ఆదాయాన్ని బాధ్యతగా నిరేశించిన బ్యాంకు ఖాతాలకు జమచేయాల్సిన చాంద్‌బాషా అడ్డగోలుగా దారిమళ్లించినట్లు స్పష్టమవుతోంది. చెక్‌పోస్టుల నుంచి వచ్చిన ఆదాయంలో చేతివాటం ప్రదర్శించడమే కాకుండా ఇతర చెల్లింపులు, కొనుగోలు వ్యవహారంలో కూడా ఇదే పంథాను కొనసాగించాడు. అందులో ప్రధానంగా డీజల్ బిల్లులకు సంబంధించి తనవారికి చెందిన మూతబడిన రాకిన్ ఫ్యూయల్స్ ఖాతాకు రూ.17.40లక్షలను ఆర్టీజీఎస్ చేయించాడు. అదేవిధంగా తన కుటుంబీకులైన హమీదా, మగ్బూల్‌బాషాలకు ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున చెక్కుల ద్వారా నగదు బదిలీ చేశాడు. అంతేకాదు అడవుల్లో ఏర్పాటు చేసే ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల కొనుగోలుకు సంబంధించి రూ.30లక్షల వరకు హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ టెలికమ్యూని కేషన్స్‌కు పంపించినట్లు తెలిసింది. నిజానికి ఆ సంస్థ నుంచి ఎన్ని కెమెరాలు కొనుగోలు చేశారు? వాటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు, కొనుగోలుకు ముందు కొటేషన్ వ్యవహారం ఇలాంటిదేమి లేదు. అందులో కూడా భారీగా నొక్కేసినట్లు సమాచారం.

అమాయకులను బలిచేసి

ఆత్మకూరు అటవీశాఖ పరిధిలో అవసరమైన వివిధ బిల్లుల పుస్తకాలు, ఇతర స్టేషనరీకి సంబంధించిన ప్రతులను ఆత్మకూరులోని మహేశ్వర ప్రింటర్స్ వద్ద తయారు చేయిస్తుంటారు. ఈ క్రమంలో ఆ ప్రింటర్స్ యజమాని శివయ్యతో చాంద్‌బాషా పరిచయం చేసుకుని దారిమళ్లించే చెక్కులను శివయ్య అకౌంట్‌కు పంపి తద్వారా నగదు పొందేవాడు. ఈ లెక్కన శివయ్య, ఆయన భార్య, తల్లి బ్యాంకు ఖాతాల నుంచే రూ.2.5కోట్లకు పైగా డ్రా చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో శివయ్యను నిందితుడిగా చేర్చినట్లు తెలిసింది. అయితే తాను అమాయకుడినని, తనకేమి తెలియదని శివయ్య అటవీ, పోలీసు అధికారుల వద్ద ప్రాధేయపడినట్లు తెలిసింది. అయినప్పటికీ శివయ్యతో పాటు అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దీంతో శివయ్య కుటుంబీకులు లబోదిబోమంటున్నారు.

ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ కూడా స్వాహా

అటవీశాఖలో దేన్నీ వదలని చాంద్‌బాషా తన అవినీతిని కొనసాగించాడు. చివరికి చిన్నపాటి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐని వదల్లేదు. వాస్తవానికి ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 330 మంది ప్రొటెక్షన్ వాచర్లు, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో పని చేస్తున్నారు. వీరికొచ్చే కొద్దిపాటి వేతనం నుంచి ప్రతినెల ఈపీఎఫ్, ఈఎస్ఐ కొంత తీసేసి ఆయా సంస్థలకు జమ చేయాల్సి ఉంటుంది. ఆ సొమ్మును కూడా జమ చేయకుండా తన అవసరాలకు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. ఈఎస్ఐ కచ్చితంగా ఆన్‌లైన్ లేదా చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. ఆ సొమ్ముకు కూడా చెక్కు రాసి డ్రా చేయడంలో ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అయోమయంగా ఆడిట్

చాంద్‌బాషా పనిచేసినంత కాలంగా ప్రతిఏటా ఇక్కడ ఆడిట్ అయోమయంగా జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ఇతర ప్రభుత్వశాఖ ఆడిట్ బృందాలు ప్రత్యేకంగా వచ్చి అన్ని కోణాలు దర్యాప్తు చేస్తాయి. అయితే అటవీశాఖలో మాత్రం సర్కిల్ ఆఫీసుకు చెందిన వారు వచ్చి ఆడిట్ చేస్తారు. వారు ఎంతవరకు జమ, ఖర్చుల వివరాలను పరిశీలించారే తప్ప ఆ సొమ్ము ఎక్కడికి బదిలీ అయింది, ఆ ఓచర్లు, ఇతర బిల్లుల పరిస్థితి ఏంటన్న వివరాలను పట్టించుకోలేదు. చివరికి సర్కిల్ ఆఫీసులో పని చేసే వారు సైతం చాంద్‌బాషా సరిగ్గానే డబ్బు బదిలీ చేస్తున్నాడా..? అన్నది ఏనాడూ చూసుకోలేదు. అంతేకాదు డ్రాయింగ్ ఆఫీసర్లు కూడా డబ్బు జమచేసి రిసిప్ట్‌లను పరిశీలించిన దాఖలాలు లేవు. ఇలా వ్యవస్థలో పర్యవేక్షణ లోపించడంతో చాంద్‌బాషా అక్రమాలు దర్జాగా సాగాయి.

అంతా చాంద్‌బాషా కనుసన్నల్లోనే

చాంద్‌బాషా పనిచేసినంత కాలం ఇక్కడ అంతా ఆయన కనుసన్నల్లోనే సాగినట్లు తెలుస్తోంది. తన కోటరీతో వచ్చిన డిప్యూటీ డైరెక్టర్లను మచ్చిక చేసుకుని తను చెప్పిందే వేదంగా పనులు జరిగించుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఐఎఫ్ఎస్ అధికారులు సైతం చాంద్‌బాషా చెప్పిన చోట సంతకాలు చేస్తూ వచ్చారని ప్రచారం ఉంది. అంతేకాదు రేంజర్లను కూడా చాంద్‌బాషా తన గుప్పిట్లో పెట్టుకున్నట్లు తెలిసింది. అడవుల్లో జరిగే వివిధ సివిల్ వర్క్స్, ఇతర సీడ్ ప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించి బిల్లులన్ని చాంద్‌బాషే చక్కదిద్దేవాడు. అక్కడ పనులు జరిగినా, జరగకున్నా.. కావాల్సినంతా బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో రేంజర్లకు కూడా భారీగా వాటాలు ముట్టినట్లు విమర్శలు లేకపోలేదు. వాస్తవానికి రేంజ్ పరిధిలో జరిగే పనులన్ని చెక్కుల ద్వారానే లావాదేవీలు జరగాల్సి ఉంది. కానీ ఓ రేంజర్ అటువంటి చెక్కులను తన సతీమణి పేరుతో డ్రా చేసుకున్న సందర్భాలను ప్రస్తుతం అటవీ అధికారులు గుర్తిస్తున్నారు. అదే రేంజర్ చాంద్‌బాషా రిటైర్ అయినప్పటికీ ఆయన్ను కొనసాగించేలా ప్రయత్నాలు చేశాడు.



చాంద్‌బాషా అక్రమాలను ఆధారాలతో సహా వెల్లడిస్తున్న ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా (ఫైల్)

ఆరుగురితో విచారణ బృందం

ఆత్మకూరు అటవీశాఖను కుదుపేసిన చాంద్‌బాషా వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు చాంద్‌బాషా పరారీలో ఉన్నారు. అదేక్రమంలో అటవీశాఖ కూడా ఈ ఘటనపై పీసీసీఎఫ్ ఏకే నాయక్ మే 19వ తేదీన ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. ఇందులో ఎస్ఎన్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ బీ.ఏ.కృష్ణమూర్తి, విజిలెన్స్ డీఎఫ్ఓ ఎన్.శివకుమార్, నంద్యాల సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, ఆత్మకూరు, నంద్యాల డివిజన్లకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు చంద్రశేఖరరాజు, జీఎస్. రవికుమార్, రమేష్‌లను నియమిందింది. కానీ.. ఇప్పటివరకు వీరిలో ముగ్గురు మాత్రమే ఒక విచారణ చేశారే తప్ప మిగతా దర్యాప్తును పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రత్యేక విజిలెన్స్ కమిటీ లేక సిట్ వేస్తే తప్ప త్వరగా కొలిక్కి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

సమగ్ర దర్యాప్తుకు సహకరిస్తున్నాం



తమ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డు అయిన చాంద్‌బాషాపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాము. ప్రస్తుతం ఆయన పరారీలో ఉండి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు వేయడంతో పోలీసులు కూడా కౌంటర్ ఫైల్ చేస్తున్నారు. ఇప్పటికే ఆయన చేసిన అక్రమాలపై సమగ్రంగా విచారిస్తున్నాము. పోలీసుల విచారణకు కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాము. ఎవరైతే బినామీలుగా వ్యవహరించారో వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాము. అలాగే పీసీసీఎఫ్ ఏకే నాయక్ ఆదేశాల వరకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటైంది. వారు కూడా దర్యాప్తు చేయనున్నారు.

● వి.సాయిబాబా, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్, డిప్యూటీ డైరెక్టర్

విజిలెన్స్ తనిఖీలు

నంద్యాల రూరల్, నంద్యాల కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివార్లలోని ఆటోనగర్ వద్ద నందిమిల్క్ డెయిరీ, చాబోలు రస్తాలో నాగశివ ట్రేడర్స్‌లో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు చౌడేశ్వరీ ఆదేశాల మేరకు విజిలెన్స్, ఫుడ్‌సెఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటరాముడు తెలిపారు. నంది మిల్క్ డైయిరీని తనిఖీ చేసి ప్యాకింగ్‌కు అనుమతులు లేవని గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారులు జిలానీ, అనిత రూ.25వేలు జరిమానా విధించారు. అలాగే పాలు, నెయ్యి, పెరుగు శాంపిల్స్ అధికారులను సేకరించారు. వీటిని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ల్యాబ్ నివేదికలు రాగానే చర్యలు తీసుకుంటామని అన్నారు. ల్యాబ్, బాయిలర్‌కు సంబంధించిన అనుమతులు లేవని, రికార్డులు కూడా సరిగ్గా లేవని అన్నారు. అలాగే చాబోలు రస్తాలో నాగశివ ట్రేడర్‌లో లూజుగా కందిబేడలు విక్రయిస్తున్నారని, బ్రాండెడ్ పేరుతో స్టిక్కర్లు అంటించి అమ్ముతున్నారని విజిలెన్స్ సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారులకు రిపోర్టు సమర్పిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

చేనేత వస్త్రాల భౌగోళిక గుర్తింపునకు చర్యలు

- 'రిజల్యూట్' ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ
- టవల్స్, బెడ్‌షీట్స్‌ను పరిశీలించిన సంస్థ ప్రతినిధి



అధికారులతో మాట్లాడుతున్న రిజల్యూట్ సంస్థ ప్రతినిధి శ్రీవాత్స

ఎమ్మిగనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 'ది ఎమ్మిగనూరు చేనేత సహకార సొసైటీ(వైడబ్ల్యూసీఎస్)'కి చెందిన చేనేత వస్త్రాలకు భౌగోళిక గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు డాక్యుమెంటరీని రూపొందించేందుకు హైదరాబాద్‌కు చెందిన రిజల్యూట్ ఫర్ ఐపీ సంస్థ లీగల్ ప్రతినిధి శ్రీవాత్స గురువారం వైడబ్ల్యూసీఎస్‌ను సందర్శించారు. సహకార సొసైటీకి చెందిన ఏడీ, కార్యదర్శి అప్పాజీ, జిల్లా డీవో నరేంద్రరెడ్డితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ పూర్వపరాలు, స్థానికంగా తయారవుతున్న వస్త్రాల గురించి తెలుసుకున్నారు. టవల్స్, బెడ్‌షీట్లను పరిశీలించారు. అనంతరం శ్రీవాత్స విలేకరులతో మాట్లాడారు. వైడబ్ల్యూసీఎస్‌లో తయారైన బర్డ్‌ఐ టవల్స్, బెడ్‌షీట్లకు భౌగోళిక గుర్తింపుకోసం డాక్యుమెంటరీ తీసి కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశీలించి జియోకు అనుమతిస్తుందన్నారు. సొసైటీ వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు లభిస్తే వస్త్రాల ధరలు 30శాతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సొసైటీ సెక్రటరీ, ఏడీ అప్పాజీ మాట్లాడుతూ 1938లో చేనేత సహకార సంఘాన్ని పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 16 విక్రయశాలలు ఏపీ, తెలంగాణ కర్ణాటకలో ఉన్నాయన్నారు. రూ. 3కోట్ల టర్నోవర్‌తో సొసైటీ నడుస్తుందని అన్నారు. ఇక్కడి వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు లభిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. సొసైటీ డిజైనర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

29న టీజీవీ కళాక్షేత్రంలో 'స్వేచ్ఛ'

కర్నూలు కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెలనెలా నాటక ప్రదర్శనల్లో భాగంగా ఈనెల 29న సాయంత్రం 7 గంటలకు హైదరాబాదుకు చెందిన బీఎం రెడ్డి దర్శకత్వంలో 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాటిక రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు అందుకొని సంచలనం సృష్టించిందని, ఈ నాటికలో 'బలగం' సినిమా ఫేం నటి సురభి లలిత ఒక ముఖ్యపాత్రలో నటిస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే ఈ నాటిక ప్రదర్శనకు ముందు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, కళాక్షేత్రం కళాకారులతో 'శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) సన్ని వేశ ప్రదర్శన ఉంటుందని ఆయన తెలి పారు. ఇందులో శ్రీకృష్ణునిగా భాస్కర్ యాదవ్, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి, అరుసుడిగా కేవీ రమణ నటిస్తున్నట్లు ఆయన వివరించారు.

హ్యాపీ బర్త్‌డే బామ్మ..!

కుటుంబ సభ్యుల నడుమ 100వ జన్మదిన వేడుకలు

మద్దికెర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామానికి చెందిన కాలుగుల హనుమంతమ్మ అనే బామ్మకు వందేళ్లు పూర్తి కావడంతో కుటుంబ సభ్యులు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ నెల 25వ తేదీకి హనుమంతమ్మకు వందేళ్లు పూర్తి కావడంతో కుటుంబ సభ్యులంతా పుట్టిన ఊరైన బురుజుల గ్రామానికి వెళ్లి అందరూ ఒకే చోట చేరుకుని వేడుకలను జరుపుకున్నారు. ఆ కుటుంబంలో కుమారులు, కోడళ్లు, కుమార్తెలు, అల్లుళ్లలు, మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు అందరూ కలిసి మొత్తం 89 మందికి బురుజుల చేరుకున్నారు. హనుమంతమ్మ భర్త హనుమంతు 20ఏళ్ల క్రితమే మరణించినప్పటికీ ఆ కుటుం బాన్ని నెట్టుకొచ్చింది. కొడుకులు ప్రయోజకులై వివిధ ప్రాంతాల్లో స్థిరపడిపోయారు. బామ్మ ఆరోగ్యంగా ఉండటం విశేషం.



వందేళ్ల బామ్మ పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న దృశ్యం

కొత్తవారు ఎప్పుడొచ్చేనో?

- బదిలీ అయినా అక్కడే విధులు..
- పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులు
- ఏకోపాధ్యాయ, ప్రాథమిక పాఠశాలల్లో సమస్య అధికం
- డీఎస్సీ అభ్యర్థులు వచ్చే వరకు ఇదే పరిస్థితి

కొలిమిగుండ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీలు అయినా కూడా కొత్తవారి రాక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఈఏడాది పెద్దఎత్తున ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. ఉపాధ్యాయులు బది లీలకు దరఖాస్తు చేసుకొని తాము కోరుకున్న స్థానాల్లో కొలువులు సంపాదించారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా చాలామంది బదిలీ అయినా పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖాళీ అయిన స్థానంలో మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో ఉన్నవారు రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. ఈసమస్య అధికంగా ప్రాథమిక, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అధికంగా ఉంది. ఉన్నతపాఠశాలల్లో సైతం సబ్జెక్టు టీచర్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. బదిలీ అయినప్పటికీ మరో ఉపాధ్యా యుడు వచ్చే వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 3వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు జరగ్గా 30శాతానికి పైగా ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి. దీంతో బదిలీ అయినా కోరుకున్న స్థానానికి వెళ్లలేక వారు అసంతృప్తిగా ఉన్నారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వేగంగా పావులు కదుపుతోంది

ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరీక్షలు పూర్తి కాగా, మరి కొన్ని జరగాల్సి ఉంది. త్వరలోనే పలితాలు ప్రకటించి, వీరికి పోస్టింగ్ ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. జూలై 17 తర్వాత పలితాలు వెలువరించి, వెంటనే పోస్టింగ్ ఇవ్వనున్నారు. దీంతో డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే కొనసాగే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నూతన ఉపాధ్యాయులు వచ్చాక బదిలీ అయిన ఉపాధ్యాయులంతా కోరుకున్న స్థానాలకు వెళ్లే అవకాశం ఉంది.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో..



కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ ఉత్తర్వులు అందుకున్నాను. పెట్నికోట ఉన్నత పాఠశాలకు నా స్థానంలో మరో ఉపాధ్యాయుడు రాకపోవండతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా.

● రమణయ్య, తెలుగు పండిట్, పెట్నికోట ఉన్నతపాఠశాల

జూలై 17 తర్వాత డీఎస్సీ అభ్యర్థులు..

బదిలీ అయిన ఉపాధ్యాయులు పలుచోట్ల పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. జూలై-17 తర్వాత డీఎస్సీ అభ్యర్థులు పోస్టింగ్ పొందుతారు. వారి రాకతో బదిలీ అయిన టీచర్లు రిలీవ్ కావడానికి మార్గం సుగమమవుతుంది.

● శంకర్ ప్రసాద్, డిప్యూటీ డీఈవో, నంద్యాల

అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

- జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో సమావేశం జరిగింది. మూడు సంవత్సరాల కిందట వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆర్‌డీఎస్‌డీ సంస్థ ఆధ్వర్యంలో టెక్నికల్ ఒకేషనల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులందరికీ జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు జీ.లాలెప్ప, నాగస్వామి నాయక్, పద్మావతి, డీఐఈవో కార్యాలయ అధికారి నాయకంటి సుంకన్న, పరిపాలనా అధికారి పాల్గొన్నారు.

జగన్ పాలన అంతా విధ్వంసమే



- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలన అంతా అరెస్టులు, కబ్జాలు, విధ్వంసంతో సాగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రానికి ఏమీ చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇచ్చిన మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఇప్పటికే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. త్వరలో మహిళలకు ఆడబిడ్డ నిధి, రైతులకు ఆర్థిక తోడ్పాటు, యువతకు నిరుద్యోగ భృతి అందిస్తారన్నారు. పేదరికం లేని సమాజం కోసం చంద్రబాబు కృషి చేస్తుంటే అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

సోదరభావంతో జీవించాలి

- తెలంగాణ విజిలెన్స్ డీజీపీ శ్రీనివాసరెడ్డి



గ్రామస్థులతో తెలంగాణ విజిలెన్సు డీజీపీ కె.శ్రీనివాసరెడ్డి

సి. బెళగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరూ సోదరభావంతో కలిసిమెలసి జీవించాలని తెలంగాణ రాష్ట్ర విజిలెన్సు డీజీపీ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలగా ఉన్న స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా సర్పంచ్ రవిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవిస్తేనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామాల్లో విద్యను అభివృద్ధి చేయాలని, విద్య వలన మేథస్సు పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధమ్మ, మండల విద్యాధికారి ఆదాంబాషా, ఉపాధ్యాయులు క్రిష్టారెడ్డి, వెంకటేశ్వరగౌడు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ తర్వాతే బదిలీ చేయాలి

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల రైషనలైజేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా పూర్తయ్యాకే బదిలీలు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ స్పష్టం చేశారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ ఫంక్షనరీస్‌కు సరైన జాబ్ చార్ట్ లేకపోవడం, పదోన్నతులపై సర్వీసు రూల్స్ లేకపోవడం వలన లక్షలాది ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌లో గత ప్రభుత్వ కాలయాపన నుంచి సీపీటీ పరీక్షలను రద్దు చేయించడానికి సచివాలయ ఉద్యోగులకు ఏపీజీఈఏ సంఘం అండగా ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సురేష్‌రెడ్డి, నగర కార్యదర్శి చెన్నకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

అవుకు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని మెట్టుపల్లె గ్రామం మెట్ట సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామానికి చెందిన నాగేంద్రరెడ్డి(61) గురువారం అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. పని ముగించుకొని మధ్యాహ్నం 3:30గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మెట్టుపల్లె గ్రామం మెట్ట సమీపంలోకి వచ్చే సరికి బనగానపల్లె నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. నాగేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతిచెం దాడు. బైక్‌ను ఢీకొన్న కారు అదుపు కాక బోల్తా పడి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఎయిర్ బెలూన్లు తెరచుకోవటంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. వారు వేరే వాహనం ఎక్కి పరారయ్యారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ఈప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు కాగా కారు ముందు భాగం దెబ్బతింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పార్వతమ్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



దెబ్బతిన్న కారు ముందు భాగం

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు.. మండ్లెం గ్రామానికి చెందిన ఇస్మాయిల్(50) సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. అతడితో పాటు మరో నలుగురు గురువారం జూపాడుబంగ్లాకు సెంట్రింగ్ సామగ్రిని ఆటోలో తీసుకువస్తున్నారు. పారుమంచాల చెక్‌పోస్టు సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ఈఘటనలో అందులో ఉన్న ఇస్మాయిల్ శ్రీనివాసులు, అబ్దుల్లాకు తీవ్రగాయాలు కాగా, రఫీకి స్వల్ప గాయాల య్యాయి. క్షతగాత్రులను నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఇస్మా యిల్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం





ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, డీఐజీ, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే.., నగరంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

- డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- కర్నూలు నగరంలో భారీ ర్యాలీ
- పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత బానిసలైతే జీవితాలు సర్వనాశనం అవుతాయని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. అదేవిధంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డీఐజీతో పాటు కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మేయర్ బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తి పిలుపుతో మాదక ద్రవ్యాల నియంత్రణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో చిన్న కుటుంబాల వల్ల ఒంటరి తనంతో మానవ సంబంధాలు దెబ్బతిని యువత మాదకద్రవ్యాల అలవాట్లకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుం దన్నారు. పోలీస్ శాఖ సైతం డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం అవుతున్నాయనీ, ఇలాంటి డ్రగ్స్ మహమ్మారీని నాశనం చేయక పోతే మనుగడ కష్టమన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించడం, వీటిని సేవించే వారికి రీహాబిలేషన్ చికిత్స అందించడం కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. జిల్లాలో ప్రతి నెల మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎక్కడైనా కాలేజీ, పాఠశాలల్లో ఎవరైనా యువత డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా వారిపై ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని 6 నెలల వరకు బెయిల్ కూడా రాదన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి యువత తెలుసుకుని మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల యువత జీవితాలు నాశనం అవుతుందన్నారు. గతంలో డ్రగ్స్ కేవలం పెద్ద నగరాల్లో మాత్రమే ఉండేవని, ఇప్పుడు జిల్లాలకు వ్యాప్తి చెందిందన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యం వాడకం, రవాణా విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఇన్‌చార్జి ఆర్‌డీవో వెంకటేశ్వర్లు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఎంహెచ్‌వో పి.శాం తికళ, అడిషినల్ డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ మహేశ్వర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఈవో శామ్యూల్ పాల్, మెప్మా పీడీ నాగ శివలీల పాల్గొన్నారు.

భవిష్యత్‌పై దృష్టి సారించాలి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్





మాట్లాడుతున్న న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, ప్రసంగిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ఆలం నరసానాయుడు

నంద్యాల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చక్కటి ప్రణాళికతో భవిష్యత్ లక్ష్యంపై దృష్టి సారించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల నియోజకవర్గ స్థానిక సంస్థల క్రియాశీలక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాలపై పార్టీ పరిశీలకులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణను పాటిస్తూ అంకితబావంతో పని చేయడమే ప్రధాన కర్తవ్యమన్నారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు కేబినేట్‌లో పనిచేయడం, నారా లోకేశ్‌తో మంత్రివర్గంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాధించాల్సిన లక్ష్యాల కోసం ప్రణాళికతో ముందుకు వెళ్లడమే తక్షణ కర్తవ్యమన్నారు. ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లాలన్నారు.

పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు : ఆలం

పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి వారికే ప్రాధాన్యం ఇస్తామని ఎన్నికల పరిశీలకులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు స్పష్టం చేశారు. టీడీపీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. నాయకులు, కార్యకర్తలు చేసిన కృషివల్లే మళ్లీ అధికారంలోకి వచ్చామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జయకేతనం ఎగర వేయాలంటే సమష్టి లక్ష్యాలతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు అందిస్తున్న ప్రజా రంజక పాలనలో ఎలాంటి లోపాలు దొర్లకుండా చూసుకో వాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, పార్టీ పరిశీలకులు అన్సర్‌బాషా, రామేశ్వరరెడ్డి, నబీసాహెబ్, రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో డ్రగ్స్ నివారణ

నంద్యాల టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌ను నివారించడంలో ప్రతి ఒక్కరి కృషి అవసరం అని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. గురువారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిరహించారు. వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం అనేది మానసికంగా ఆర్థికంగా నాశనం చేస్తుందని అన్నారు. దీంతో యువత చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందుకోసం పోలీసు శాఖ ఈగల్ టీం ఏర్పాటు చేసిందన్నారు. ఈ బృందం డ్రగ్స్ ముఠాలకు వ్యతిరేకంగా నిరంతరం నిఘా కొనసాగిస్తుందన్నారు. ఇప్పటి వరకు 37 కేజీల గంజాయిని, 47 మందిని అమ్మిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పది మెడికల్ షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, కళశాలలు ల్లో 108 పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 208 అవగాహన కార్యక్రమాలు నిర్వహించమన్నారు. ఇటీవల డోన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లా అధికారులు రాముడు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, లీలావతి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

రైతులందరికీ పరిహారం వచ్చేలా కృషి

- తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి



వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పాణ్యం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సోలార్ పరిశ్రమ నిర్మాణంతో సాగు భూములు కోల్పోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రీన్‌కో కంపెనీ పిన్నాపురంలో చేపట్టిన సోలార్ పరిశ్రమ నిర్మాణంలో ప్రభుత్వ సాగు భూములు కోల్పోయిన రైతులతో సర్పంచ్ వెంకటకృష్ణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. 2019లో గ్రీన్‌కో సంస్థకు 2467.28 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించామన్నారు. ఈ భూమిలో ఎవరూ సాగులో లేనట్లు రికార్డుల్లో ఉండడంతో సంస్థకు కేటాయించామన్నారు. రికార్డులు లేకుండా పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న రైతులకు న్యాయం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసి 197 మంది రైతులను గుర్తించి జాబితా తయారు చేశామన్నారు. ఇందులో ఐదెకరాల వరకే పరిహారం ఇవ్వడానికి పరిమితి అన్నారు. జాబితాలోని రైతుల వివరాలను బహిరంగంగా తహసీల్దార్ చదివి వినిపించారు. కొందరు రైతులు తమ పేర్లు జాబితాలో లేవని ఆందోళన వ్యక్తంచేశారు. జాబితాలో పేర్లు లేని రైతుల అర్జీలు తీసుకొని తప్పనిసరిగా నష్టపరిహారం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రకుమార్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ఆర్ఐ రాము, సర్వేయరు నాగరాజు, వీఆర్వోలు బీరేంద్ర, శ్రీనివాసులు, శంకర్, ఏఆర్ పోలీసులు, రైతులు పాల్గొన్నారు.

మొదటి లిస్టులో పేరుంది



గతంలో రెవెన్యూ అధికారులు ప్రచురించిన జాబితాలో నాపేరు ఉంది. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో నాపేరు లేదు. నాకు 50సెంట్ల ప్రభుత్వ భూమికి నష్ట పరిహారం అందాల్సి ఉంది. గ్రామసభలో ప్రకటించే వారికి మాత్రమే నష్టపరిహారం అందిస్తే నష్టపోతాను. కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్నాను.

- ఓర్వకంటి నాగలక్ష్మన్న, పిన్నాపురం

సాగులో ఉన్నా జాబితాలో పేరు లేదు



మా పూర్వీకుల కాలం నుంచి ప్రభుత్వ భూమి రెండెకరాలు సాగు చేసుకుంటున్నా. ఇప్పుడు అధికారులు ప్రకటించిన జాబితాలో నా పేరులేదు. నాకు నష్ట పరిహారం ఇవ్వాలి. పంట సాగును అధికారులు గుర్తించకపోవడమే ఇందుకుకారణం.

- బిజ్జమ్మగారి వెంకటరాముడు, పిన్నాపురం

ప్రభుత్వ లాంఛనాలతో మొహర్రం

- రూ.10 లక్షల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో నవాబు వారసులు

బనగానపల్లె, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ లాంచనాలతో ఈ ఏడాది మొహర్రం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని ఆస్థానం పీర్ల వద్ద మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నవాబు వారసుడు మీర్ ఫజిల్ అలీఖాన్, షియా ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. మతగురువులతో పాటు షియా ముస్లింలు బీసీకి ఘన స్వాగతం పలికారు. మొహర్రం సందర్భంగా మంత్రి బీసీ ప్రత్యేక చొరవతీసుకొని సీఎం చంద్రబాబు, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సహకారంతో మొహర్రం వేడుకలు నిర్వహించడానికి రూ.10లక్షలు నిధులు కేటాయించారన్నారు. వీరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్థానం పీర్లను మంత్రి బీసీ సందర్శించారు. ఆస్థానం బంగారు పీర్లవద్ద మంత్రి బీసీ ప్రత్యేక ఫాతేహాలు చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.తొలిసారి బనగానపల్లెలో మొహర్రం వేడుకలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించా మన్నారు. ముంబై తర్వాత బనగానపల్లెలోనే ఈ వేడుకలు భారీగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు కులమతాలకతీతంగా ఈవేడుకలు సంతోషంగా జరుపుకోవాలని మంత్రి కోరారు.

మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. నవాబు వారసుడు మీర్ ఫజిల్ అలీఖాన్ మాట్లాడుతూ తొలిసారిగా ప్రభుత్వం రూ.10లక్షలు నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న మాజీ జడ్పీచైర్మన్ బత్తిన

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పత్తికొండ నియోజక వర్గంలోని రామలింగాయపల్లె గ్రామంలో ప్రభుత్వ బాలుర హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషాను మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రా ముడు కోరారు. గురువారం కలెక్టర్‌ను కలిసి బత్తిన పుష్పగుచ్ఛం అందజేశారు. బత్తిన వెంకట్రాముడు మాట్లాడుతూ రామలింగాయపల్లెలో హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో బీసీ విద్యార్థులు అధికంగా ఉన్నారని, ఇక్కడ అధికంగా వలసలు వెళ్తుంటారని, దీంతో పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. అందు వల్ల ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కార్మిక కోడ్లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం పాతబస్తీలోని సుర్జీత్ భవన్‌లో నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వకుండా పని ఒత్తిడి పెంచి ఉద్యోగాలు వదిలి వెళ్లిపోయేలా చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆఫీస్ బేరర్స్ నాగస్వాములు, మైమూద్, ఖాజాపాషా, రామకృష్ణ, సోలోమన్‌రాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు శుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు ఇంటి పైకప్పులను శుభ్రంగా ఉంచుకోవాలని, పైకప్పుల్లో వర్షపునీరు నిలువ ఉండకుండా సజావుగా కిందికి సాగేలా చూడాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. గురువారం ఆయన సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. పైకప్పుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఆ నీరు లోపలికి వెళ్లి ఐరన్ పాడై పెచ్చులు ఊడుతాయని, స్లాబ్ పటిష్టత దెబ్బ తింటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని మున్సిపల్, సచివాలయ, పాఠశాల, కమ్యూనిటీ భవనాలపై శుభ్రం చేసేందుకు వారంరోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. సంబంధిత సిబ్బంది పైకప్పులను శుభ్రంగా చేసి నీరు సజావుగా, ఆటంకల లేకుండా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా తమ ఇంటి పరిసరాల్లో పాతటైర్లు, కుండలు, ప్లాస్టిక్ బాటిల్ తదితర వాటిల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు.

పెద్దాసుపత్రికి మూడు ఏసీలు విరాళం


సూపరింటెండెంట్‌కు ఏసీలను అందజేస్తున్న మెడికవర్ హాస్పిటల్ కర్నూలు సెంటర్ హెడ్ వై. మహేశ్వరరెడ్డి

కర్నూలు హాస్పిటల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద మూడు ఏసీలను విరాళంగా అందించారు. గురువారం ఉదయం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు చాంబర్‌లో మెడికవర్ హాస్పిటల్ కర్నూలు సెంటర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి ఏసీలను అందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు

సి.బెళగల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. గురువారం కొత్తకోట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం నసీమాబేగం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసులు రూ.30 వేల విరాళం అందజేశాడు అనంతరం విద్యార్థులు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తబస్టాండ్‌కు మరో 25 కుర్చీలు


కుర్చీలు వేస్తున్న డిప్యూటీ సీటీఎం, సీనియర్ సిటిజన్లు

కర్నూలు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు కొత్తబస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ కేంద్ర కార్యాలయం మరో 25 (త్రీసీటర్) కుర్చీలను మంజూరు చేసిందని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధారాణి తెలిపారు. ఈమేరకు సీనియర్ సిటిజన్ హనుమన్న, వ్యాపారవేత్త సుబ్బారావు చేతుల మీదుగా గురువారం ఆ కుర్చీ లను ప్రారంభించి వాడుకలోకి తెచ్చారు. డిప్యూటీ సీటీఎం సుధారాణి మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ కృషి చేస్తుందన్నారు. బస్సు వచ్చే వరకు ప్రయాణికులు కొద్దిసేపు కుర్చునే విధంగా సంస్థ త్రీసీటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు-2డిపో మేనేజర్ శర్మ, కర్నూలు-1డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, బస్ స్టేషన్ మేనేజర్ కాంచన పాల్గొన్నారు.

కుట్టు.. ఉపాధికి మెట్టు

● శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు
● మహిళల ఆర్థిక స్వావలంబనకు
కూటమి ప్రభుత్వం చర్యలు

ఓర్వకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వాలంబనకు అడుగులు పడుతున్నాయి. కుట్టు శిక్షణతో ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి దుస్తుల తయారీలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్నల వివిధ రకాల మోడల్ డ్రస్సులను తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి భవనంలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రంలో ఉదయం 50 మంది మహిళలకు, సాయంత్రం 50 మంది మహిళలకు శిక్షణ ఇచేలా ప్రణాళికలు రూపొందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్లు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందేందుకు అర్హులైన మహిళలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేశారు. శిక్షణ కేంద్రంలో రోజుకు రెండు పూటలా రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ హాజరు 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసే అవకాశం ఉంది. ఈ శిక్షణ కేంద్రానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో నూతన మెలకువలతో తయారు చేసిన దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇంట్లో పని చేసుకుంటూ కుట్టుమిషన్ల ద్వారా జీవనోపాధులను కల్పించుకోవడానికి అవకాశం ఉందని ఆలోచనతో చాలా మంది మహిళలు కుట్టు శిక్షణ వైపు దృష్టి సారిస్తున్నారు.


ఓర్వకల్లు పొదుపు భవనంలో శిక్షణ పొందుతున్న మహిళలు

సీఎంకు రుణపడి ఉంటా



ఉచిత కుట్టుమిషన్ల ద్వారా టైలరింగ్ నేర్చుకుంటున్నా. ఈశిక్షణతో ఉపాధి కలుగుతుందని ఒక నమ్మకం ఏర్పడింది. మహిళల్లో ఆర్థికాభివృద్ధిని పెంపొందించి బతుకుతెరువుకు భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

● రామలక్ష్మి, కాల్వ

ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరం

మహిళల్లో ఆదాయ వనరులు పెంచడానికి కుట్టు శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం సంతో షకరం. ఈశిక్షణతో ఉపాధి లభిస్తుందనే నమ్మకం. సాటి మహిళలకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

● షేక్ రిజ్వానా, ఓర్వకల్లు

ఒక్కో బ్యాచ్‌కు 90 రోజులు..



కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికాభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కుట్టుశిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఒక్కో బ్యాచ్‌కు 90 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణలో దాదాపు రోజుకు 100 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. వారికి 75 శాతం అటెండెన్స్ ఉంటే కుట్టుమిషన్లు ఇస్తున్నాం.

● ఎంపీడీవో, శ్రీనివాసులు, ఓర్వకల్లు

యువత మత్తుకు బానిస కావొద్దు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ
కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి


మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు హాస్పిటల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం విశ్వభారతి మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డా. కృష్ణ నాయక్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ హాజరయ్యారు. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం మెడికల్ కాలేజీ విద్యార్థులకు ర్యాగింగ్ దానికి సంబంధించిన శిక్షలు, జరిమానాలను వివరించారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కృష్ణ నాయక్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం పారా లీగల్ వలంటీర్ రాయపాటి శ్రీనివాస్ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కర్నూలు ఎడ్యుకేషన్: డ్రగ్స్ రహిత సమాజామే ప్రభుత్వ లక్ష్యమని బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అన్నారు. స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా నిర్మూలనకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్నకుమార్, వాణీ ప్రసన్న, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

● యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంపు మున్సిపల్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశలో శ్రద్ధగా చదివి మంచి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిల్వర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్, ప్రసాదరెడ్డి, బి. అనూష, వినిలియో, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.



బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల, క్లస్టర్ యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏవో దస్తగిరి రెడ్డి

గూడూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైతులకు విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో దస్తగిరిరెడ్డి హెచ్చరించారు. గురువారం గూడూరు పట్టణంలోని విత్తన దుకాణాన్ని ఏవో దస్తగిరి రెడ్డి తనిఖీ చేసి, విత్తన నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని, రికార్డులను సక్రమంగా మెయింటెనెన్స్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి: ఏవో

ఓర్వకల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని ఏవో మధుమతి అన్నారు. బుధవారం ఓర్వకల్లు, లొద్దిపల్లె, కన్నమడకల గ్రామాల్లో విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దుకాణాల యజమానులు రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు తక్షణమే బిల్లులు ఇవ్వాలన్నారు. ఆమె వెంట ఏఈవోలు ఉన్నారు.

స్వామి సహజానంద సరస్వతి వర్ధంతి

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత రైతు సంఘం స్థాపించిన స్వామి సహజానంద సరస్వతి 75వ వర్ధంతిని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. గురువారం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం స్వామి సహ జానంద సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగన్నాథం మాట్లాడుతూ సరస్వతి జాతీయవాది, రైతు ఉద్యమ నాయకుడుగా ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. జిల్లా సహయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు, చింత మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీసన్న, భారతి, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. గురు వారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, ఇంటిపన్ను, ఆన్‌లైన్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిర్లక్ష్యం వహించకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ సైపుల్లా బేగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ఓర్వకల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రాణేష్ కుమార్ పదవీ విరమణ పొందారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఈవో శామ్యూల్ పాల్ హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు ప్రాణేష్ కుమార్‌కు శాలువలు వేసి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు, ప్రధా నోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, నిర్మల, వసంత కుమారి పాల్గొన్నారు.

ఆర్‌పీగా షబీరాను కొనసాగించాలి


మెప్మా ఐబీ మురళికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం, ఐక్య సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముజఫర్ నగర్ రమా ఐక్య సంఘం రిసోర్స్‌పర్సన్‌గా షబీరాబానును కొనసాగించాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు కోరారు. గురువారం మెప్మా ఐబీ మురళిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాముడు మాట్లా డుతూ గతంలో ఆర్‌పీగా పని చేసిన పొదుపు సంఘాల డబ్బులను సొంతానికి వాడుకో వడం వల్ల పాత ఆర్పీనీ తొలగించి కొత్త ఆర్పీగా షబీరాబాను నియ మి స్తూ ఐక్య సంఘం 2023 జనవరిలో తీర్మానం చేశారన్నారు. రెండున్నర ఏళ్లుగా ఎలాంటి జీతం లేకుండా ఆర్పీగా పని చేస్తున్నా కూడా ఇప్పటి వరకు షబీరాబాను పేరు ఆన్ లైన్‌లో ఎక్కించకుండా అధికారులు అలసత్వం చేశారని అన్నారు. సీపీఎం నగర ఉపాధ్యక్షుడు సాయిబాబా, ఆర్‌పీల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, రమా ఐక్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శారదమ్మ, సువార్త పాల్గొన్నారు.

లలితాపీఠంలో పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితాపీఠంలో గురువారం ఆషాడమాసం ఆరంభ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో మహిళా భక్తులు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సామూహిక కుంకుమార్చనలు చేశారు.

దళారులను నమ్మొద్దు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ అన్నారు. గురువారం కర్నూలు పరిసర గ్రామాలు తడకనపల్లె, నూతనపాడు, గార్గేయపురం, మిలిటరీ కాలనీ తదితర గ్రామాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. రైతులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసిందన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు


మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ పరీక్షల్లో ఈ ఏడాది 90 శాతం పైగా మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యా ర్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. గురువారం నగరంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు చెరువు దుర్గాప్రసాద్, ఆలయ మేనేజర్ శివన్నలతో కలిసి ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా నగర బ్రాహ్మణ సంఘం ఏటా ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జూలై 6న ఉదయం 10 గంటలకు సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రం (శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం)లో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హతగల విద్యార్థులు హరిహర క్షేత్రంలోని మేనేజర్ శివన్నను సంప్రదించాలని సూచించారు. వివరాలకు సెల్ నెం. 9393605937, 9701867582లలో సంప్రదించాలని కోరారు.

నేత్రాలు ఎంతో కీలకం

గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మనిషికి ఉన్న అవయవాలలో నేత్రాలు ఎంతో ముఖ్యమైనవి సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని సమాచారం సంబంధాల శాఖ కార్యాలయం వద్ద పేదలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

డాక్టర్ శంకర్‌శర్మను కలిసిన క్రీడా సంఘాల నాయకులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్న గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యనిపుణుడు బి. శంకర్‌శర్మను గురువారం క్రీడా సంఘాల నేతలు కలిశారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొన్నారు.

● క్రీడా పరికరాలు పంపిణీ: నగరంలోని గాయత్రీ ఎస్టేట్ గురుదత్త పాలీ క్లినిక్‌లో తైక్వాండో క్రీడా పరికరాల పంపిణీ జరిగింది. శంకర్‌శర్మ దంపతులుతైక్వాండో మార్షల్స్ శిక్షకులకు హెడ్ టైగార్డ్ పరికరాలు అందజేశారు.

నేడు రైతుబజార్ బంద్

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సి.క్యాంపు రైతుబజారులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తుండటంతో రైతుబజార్ బంద్ ఉంటుందని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా రైతుబజార్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులు అమ్మకానికి కూరగాయలు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంలపై స్పెషల్ డ్రైవ్

కోడుమూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలను విభజించి ఒక్కొక్కరికీ ప్రత్యేక ఎల్‌పీఎం కేటాయించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పులకుర్తి, వర్కూరు, అనుగొండ, అమడగుంట్ల, ముడుములగుర్తి గ్రామాల్లో ఇదివరకు రీసర్వే జరిగిందన్నారు. జాయింట్ ఎల్‌పీఎం నెంబరు పడిన రైతులు సచివాలయంలో రూ.50లు ఫీజు చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు


విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న టీఎస్ఎఫ్ సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నిరుపేద గిరిజన విద్యార్థులకు ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని రూపమాపవచ్చని ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామరాజు, వెంకటేశ్, ఎరుకుల సంఘం నాయకులు కరివేపాకు రామకృష్ణ, మోటా రామాంజనేయులు పాల్గొన్నారు.



ఎం.అగ్రహారం జడ్పీ పాఠశాలలో 2022లో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద నిర్మించిన అదనపు తరగతి గదులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. రూ.10లక్షలతో కాంట్రాక్టర్ రెండు గదులను గోడలను నిర్మించి, మరో రెండు గదులు పునాదులకే పరిమితం చేశాడు. పీఆర్ ఏఈ విష్ణు మాట్లాడుతూ గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. - మద్దికెర



మండలంలోని జొన్నగిరి వద్ద పత్తికొండ నుంచి గుత్తి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఈ దారిలో ప్రయాణిస్తే బోల్తా పడే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు వాహనదారులు ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆరు నెలల క్రితం ప్యాచ్‌వర్కు చేసినా మళ్లీ గుంతలు పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - తుగ్గలి

వైసీపీ ఆర్‌టీఐ కమిటీ కార్యదర్శిగా తిమ్మప్ప



ఆదోని అగ్రికల్చర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ స.హ.చట్టం విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప నియమితులయ్యారు. తనకు అవకాశమిచ్చిన మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే సాయి, జయమనోజ్ రెడ్డికి తిమప్ప కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

వెల్దుర్తి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పదిరోజులకోసారి తాగునీరు' శీర్షికన ఈ నెల 25న కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని మండల అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ వార్డుల్లో ప్రజలను అడిగి సమస్యను తెలుసుకున్నారు. బోర్లను, ఎయిర్ వాల్వులు, సంపులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్యతో కలిసి పరిశీలించారు. తాత్కాలికంగా ట్యాంకుల ద్వారా పాతబస్టాండ్ వీధులకు నీటిని సరఫరా చేశారు. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కడుపు నిండా భోజనం పెట్టండి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

మద్దికెర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టాలని ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని సూచించారు. గురువారం జడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం సన్నబియ్యాన్ని సరఫరా చేసిందన్నారు. మెనూ ప్రకారం భోజనం వండాలని నిర్వాహకులను కోరారు. మధ్యాహ్న భోజనంలో అవకతవకలు లేకుండా చూడాలని హెచ్‌ఎంను కోరారు. హెచ్‌ఎం దేవేంద్రప్ప, మాజీ ఎంపీటీసీ డి.శ్రీనివాసులు, ఎంపీటీసీ అంజనేయులు తదితరులు ఉన్నారు.

'తల్లికి వందన'మే ముద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పత్తికొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడి పథకం వద్దని 'తల్లికి వందన'మే ముద్దు అని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మునినాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో నాలుగుస్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో కుటుంబంలోని ఒక్క విద్యార్థికి మాత్రమే రూ.15వేలు ఇవ్వగా, టీడీపీ విద్యార్థులందరికీ రూ.15వేలు ఇచ్చిందన్నారు.

క్షయ రహిత దేశంగా మారాలి



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భారత దేశాన్ని క్షయ రహితంగా మార్చాలని వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ టీబీ యూనిట్ వైద్యసిబ్బంది క్షయపై ర్యాలీ నిర్వహించారు. ఇదిరా నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరి అరుణ, సుబ్బమ్మ బాయి, ఏఎన్ఎం నాగమ్మ, ఆశా వర్కర్లు సౌభాగ్య, ప్రతిభ, నాగమణి, మీనాక్షి పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం



పనులను పరిశీలిస్తున్న అధికారులు

హాలహర్వి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎల్‌సీ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఏఈ ఈశ్వర్ అన్నారు. గురువారం బాపురం 46వ డిస్ట్రిబ్యూటరీ వద్ద పనులను పరిశీలించారు. కంట్రోల్ పాయింట్ లేక చివరి ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడేవారని, ప్రభుత్వం రూ.5లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు.

ప్రజా సమస్యల కోసం పోరాడాలి



మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు వైసీపీ నాయకుడు, గిత్తా నాగేష్ యాదవ్ మాజీ జడ్పీటీసీ, రాష్ట్ర ఎస్టీ విభాగం జోనల్ అధ్యక్షుడు నారాయణ నాయక్ తెలిపారు. గురువారం తాడేపల్లిలో అధినేతను కలిశామన్నారు. నియోజకవర్గ పరిస్థితులను జగన్ అడిగి తెలుసుకున్నారన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ
- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజవర్గాల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం, విద్యార్థులతో ర్యాలీ



ఆదోనిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ



పత్తికొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో, నాయకులు

ఆదోని, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీయస్పీ హేమలత సూచించారు. మాద ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గురువారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. చెడు స్నేహాలు, పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయికి అలవాటుపడితే రుగ్మతల బారిన పడతారన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, తీసుకోవడం, సరఫరా, తయారీ, క్రయ, విక్రయాలు క్రిమినల్ నేరాలని, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సీఐలు శ్రీరామ్, గంటా సుబ్బారావు, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య పాల్గొన్నారు.

పత్తికొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్డీవో భరత్‌నాయక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోస ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్ మాయలో తప్పుదారిలోకి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ సీఐ స్వర్ణలత, తహసీల్దార్ నూర్‌అహ్మద్, ఎంపీడీవో శ్రీదేవి, సీఐలు జయన్న, పులిశేఖర్, కడవల సుధాకర్, బత్తిని లోక్‌నాథ్, బీటీ గోవిందు పాల్గొన్నారు.

ఆలూరు: యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హౌసింగ్ పీడీ చిరంజీవి, సీఐలు రవిశంకర్, లలితదేవి కోరారు. గురువారం పట్టణంలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మహబూబ్ బాషా, నవీన్, షరీఫ్, ఎంఈఓ కోమలదేవి, ఆర్ఐ బసవన్నగౌడ్, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, గంగమ్మ, నరసప్ప, హనుమప్ప పాల్గొన్నారు.

రేపు స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు శనివారం స్వర్ణామృత ప్రాసనాన్ని పంపిణీ చేయనున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా గురువారం తెలిపారు. ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయసున్న చిన్నారులకు రోగ నిరోధక శక్తి పెంపొందించేనిమిత్తం ఇస్తున్నామన్నారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక అంజనేయ ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తామన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

- కమాండింగ్ అధికారి ప్రసాద్

ఆలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో చేరితే విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని 28 ఆంధ్ర బెటాలియన్ కమాండెంట్ బి.ఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం ప్రభుత్వ బాలుర-1 ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీలో నమోదును నిర్వహించారు. జూలై 7వ తేదీ నుంచి అనంతపురం జిల్లా బ్రాహ్మణపల్లిలో జరగబోయే శిక్షణ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధారాణి పాల్గొన్నారు.

స్థలం ఇస్తాం.. హాస్టల్ ఏర్పాటు చేయండి

- కలెక్టర్‌కు జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు వినతి



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ హాస్టల్ నిర్మాణానికి స్థలం ఇస్తామని, బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు కోరారు. గురువారం కర్నూలులో కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి విన్నవించారు. తుగ్గలి మండలం వెనుకబడిన ప్రాంతం, బీసీలు అధికంగా ఉన్నారని పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- రెండో అదనపు కోర్టు న్యాయధికారి శ్రీవల్లి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆదోని రెండో అదనపు న్యాయాధికారి శ్రీవల్లి సూచించారు. గురువారం నోబుల్ ఒకేషనల్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యం అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు.



న్యాయాధికారికి మొక్క ఇస్తున్న నిర్వాహకులు

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. కరస్పాండెంట్ సంగటి దేవదానం ప్రిన్సిపాల్ అబ్దుల్‌బాషా, అధ్యాపకులు సౌజన్య, ప్రీతి, సోని, దినకర్, ప్రవీణ్ కుమార్, డాక్టర్ సోలోమి, డాక్టర్ కాలిక్, విజయ్ కుమార్, న్యాయవాది మమత, లోకేష్, బాలకృష్ణ, నాగరాజు, శ్రీధర్ సింగ్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు

- కంకర వేయకుండా, మట్టితో పూడ్చిన కాంట్రాక్టర్



మట్టితో పాతిన స్తంభం

చిప్పగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతో ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఇష్టానుసారంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిప్పగిరి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి దౌల్తాపురం, ఏరూరు, దేగులపాడు, బంటనహాలు గ్రామాలకు విద్యుత్తు లైన్ ఏర్పాటు చేస్తున్నారు. అయితే కాంట్రాక్టర్ నిబంధనలను పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుంతలు తీసి మట్టితో పాతుతుండటంతో ఈదురు గాలులు, వర్షాలు కురిస్తే స్తంభాలు ఒరిగిపోయే ప్రమాదం ఉంది. కంకర వేసి పాతకుండా ఇలా చేయడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ విరుపాక్షిని వివరణ కోరగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే పనులు చేస్తున్నారని వారే చూసుకుంటారని వివరణ ఇచ్చారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్



ఆలూరులో రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్ హనుమప్ప

ఆలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివాయగులకు గురువారం ఆలూరు లో ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేశారు. ఈనెల 30వ తేదీ వరకు పంపిణీ ఉంటుందని డీలర్లను ఆదేశించినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

తుగ్గలి: దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామని తహసీల్దార్ రవి అన్నారు. గురువారం నుంచే గ్రామాల్లో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఐదు రోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి డీలర్లు రేషన్ అందించారన్నారు. డీలర్స్ సంఘం అధ్యక్షుడు పగిడిరాయి సుంకన్న, చంద్రశేఖర్ యాదవ్, తిమ్మప్ప, హనుమంతు, వీఆర్‌ఏ శేఖర్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదోని రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బల్లేకల్ గ్రామ సమీపంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు పెద్దతుంబళం ఎస్.ఐ తెలిపారు. వివరాల మేరకు.. సమాచారం మేరకు గురువారం తాయమ్మ ఆలయం దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.15,500తో పాటు 52 పేకాట ముక్కలు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో 11మంది పరారయ్యారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఓ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంఈవో రమేష్‌కు వినతి పత్రం అందించారు.

అనుమతి తప్పనిసరి

తుగ్గలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మొహరం వేడుకలకు పోలీసుల నుంచి తప్పక అనుమతి తీసుకోవాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. గురువారం మండలంలోని జొన్నగిరిలో పర్యటించారు. వేడుకలను శాంతియుతంగా చేసుకోవాలని గొడవలలకు పాల్పడొద్దని, సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

మద్దికెర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలుర పాఠశాలలో తమతోపాటు 2003-04 పదో తరగతి చదివిన మిత్రుడు అనారోగ్యానికి గురికావడంతో మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు గురువారం స్నేహితుడు వెంకటేశ్‌కు రూ.42,650లు సాయం అందజేశారు. వెంకట కృష్ణారెడ్డి ఉన్నారు.

ఆదోనిలో 256 పోలింగ్ కేంద్రాలు



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆదోని రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 256 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 12వేల మందికిపైగా ఓటర్లున్న కేంద్రాలు 67 ఉన్నట్లు ఈసీ దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో విభజించే అవకాశం ఉందన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంలను పరిష్కరిస్తాం

ఉమ్మడి ఎల్‌పీఎం సమస్యలను పరిష్కరిస్తామని డీటీ పెద్దయ్య తెలిపారు. గురువారం తహసీ ల్దార్ రమేష్‌తో కలిసి మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పిఎం ఉన్న రైతులు ఈనెల 30లోపు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని, ఇప్పుడైతే కేవలం రూ.50లు మాత్రమే చెల్లించాలని జూలై 1నుంచి రూ.550లు అవుతుందన్నారు.

జాబితాలో పేర్లు తొలగించాలి



ఆర్ఐకి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఈనాం భూముల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని తుంబలబీడు గ్రామ రైతులు కోరారు. గురువారం ఆర్ఐ బసవన్నగౌడ్‌కు వినతి పత్రం అందించారు. రీ సర్వే అనంతరం తమ వారసత్వ భూములుగా చూపుతున్నాయని, బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులమయ్యామన్నారు. స్పందించిన ఆర్ఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

దేవనకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా భృతి ఇవ్వలేదన్నారు. రవికుమార్, రామాంజనేయలు, తదితరులు పాల్గొన్నారు.

పరికరాల పంపిణీ



పరికరాలు ఇస్తున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

ఆదోని అగ్రికల్చర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆదోని, ఆస్పరి మండలాల విద్యార్థులకు పట్టణంలోని భవిత కేంద్రంలో వినికిడి యంత్రాలు, వీల్‌చైర్, రోలెటర్స్ పరికరాలను గురువారం ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ అందజేశారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యం లో ఉచితంగా అందిస్తున్నామని ప్రభుత్వం అందించే పథకాలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వాహకుడు శాంత కుమార్, మౌనిక, జ్యోతి పాల్గొన్నారు.

ఎరువు.. బరువు

- బస్తాపై రూ.50 అదనం
- కాంప్లెక్స్ ఎరువు కొంటేనే ఇస్తామంటున్న డీలర్లు
- ఆర్థికభారంతో అవస్థలు పడుతున్నరైతులు



దేవనకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో దాదాపు 40 వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేక వాటి ధరలు పెరిగిపోయాయి. దుకాణదారులు బస్తాపై రూ.50ల నుంచి రూ.వంద వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. అలాగే అదనంగా కాంప్లెక్స్ ఎరువు కొంటేనే ఇస్తామని షరతు విధిస్తున్నారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

కృత్రిమ కొరత..

ప్రైవేటు దుకాణదారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యూరియా,14,35,15, 14,14,0,28 ,20,20,0,13 ఎరువులను కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్తే అందుబాటులో లేవని దుకాణదారులు అంటున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి అమ్ముతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా ప్రభుత్వ ధర రూ.270లు కాగా డీలర్లు రూ.300ల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే యూరియా కావాలంటే, కాంప్లెక్స్ ఎరువును కొంటేనే ఇస్తామని రైతులపై ఒత్తిడి తేస్తున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కోలా ధరలు



నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశా. టర్నింగ్ వద్ద ఉన్న ఎరువుల దుకాణంలో 20,20,0,13 బస్తా ధర రూ.1300లు కాగా దుకాణాదారుడు రూ.1,350లు చెప్పాడు. దీంతో వెనక్కు వచ్చా. వ్యసాయాధికారులు చర్యలు తీసుకోవాలి. - **పరమేష్, రైతు**

యూరియా వస్తుంది



మండల రైతులకు 2 వేల బస్తాల యూరియా అందుబాటులోకి వస్తుంది.. రైతులు ఆందోళన చెందవద్దు. రైతుల అవసరా మేరకు అన్ని రకాల ఎరువులను అందుబాటులోకి తెస్తాం.- **ఉషారాణి, ఏవో**

చినుకు రాలదు.. కునుకు పట్టదు

● ఊరించి ఉసూరుమనిపిస్తున్న మేఘాలు ● ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగు కావాల్సింది 1,72,930 ఎకరాలు ● ఇప్పటికే సాగు అయింది 1. 60 లక్షల ఎకరాలు

గోనెగండ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టంగా మారింది. ఆకాశం కారుమబ్బులు కమ్ముకుంటూ.. ఊరించిన మేఘాలు అరగంటలోనే ఉసురుమంటున్నాయి. 20 రోజులుగా ఇదే తంతు సాగుతోంది. సాగు చేసిన పంటలు వర్షం కురియక పోవడంతో ఈదురుగాలులకు, ఎండవేడిమికి ఎండిపోతున్నాయి. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతన్న ఆవేదన చెందుతున్నాడు. గోనెగండ్ల మండలంలో బావులు, బోర్లు, మెట్ట పొలాలు కలిపి 30వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. కంది, ఉల్లి, పత్తి, వేరుశనగ, ఆముదం, సజ్జ, మొక్కజోన్న పంటలను సాగు చేశారు. ఈనెల మొదట్లో ఆరకొర వర్షం కురిసింది. ఇక అప్పటి నుంచి వర్షం జాడలేదు. ఈదురు గాలులు, ఎండ తీవ్రత పెరిగిపోయింది. దీంతో పంటలు ఎండి పోతున్నాయి. పంట సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. మెట్ట భూముల్లో కొంత మంది రైతులు ఇంకా విత్తనం వేయలేదు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,72,930 ఎకరాలలో పంటలు సాగు కావాల్సి ఉంది. అయితే వర్షం సకాలంలో కురియక పోవడంతో ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో కేవలం 1లక్ష 60వేల ఎకరాలలో మాత్రమే పంటలు సాగయ్యాయి.

సకాలంలో కురవని వర్షం

ఈ ఏడాది రైతులకు సకాలంలో వర్షం కురియకపోవడం కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 14 ఎంఎం వర్షపాతం కురియాల్సి ఉండగా 24 ఎంఎం కురిసింది. మే నెలలో 34 ఎంఎం కురియాల్సి ఉండగా 103 ఎంఎం అధిక వర్షపాతం నమోదయ్యింది. ఇక జూన్ నెలలో 73 ఎంఎం వర్షం కురియాల్సి ఉండగా ఈ నెలలో ఇప్పటి వరకు 56 ఎంఎం వర్షం కురిసింది. దాదాపు 20 రోజులుగా వర్షం కురియక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోవడం కొత్త పంటలు సాగుచేసేందుకు పదును కాకపోవడంతో రైతన్న ఇబ్బందులు పడుతున్నాడు.



వేరుశనగ పంట వాడిపోతుంటే ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

కారుమబ్బులు కమ్మడం

ఈదురు గాలులకు మాయమైపోవడం

ఈ ఏడాది ముందస్తు వర్షాలు ఆశాజనకంగా కురియడంతో రైతులు ముందస్తు సాగు చేశారు. అయితే జూన్ నెలలో పంటలకు సరిపడా వర్షం కురియక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు ఎలా అని రైతులు వాపోతున్నారు. వర్షం కురిస్తే పంటకు ప్రాణం వస్తుందని ఇక రైతన్న వర్షం కోసం ఆకాశంవైపు ఆశగా చూస్తున్నాడు. నైరుతి రుతుపవనాలు వచ్చినా వర్షపు చినుకు రాలడం లేదు. ప్రతి రోజు సాయంత్రం ఆకాశం కారుమబ్బులు కమ్ముకోవడం కొద్దిసేపటికి ఆకాశం నీలంగా మారిపోవడం సర్వసాధారణం అయిపోయింది. జూన్ నెలలో రెండు రోజులు మాత్రమే వర్షం కురిసింది. ఆ తరువాత ఒక్కసారి కూడా వర్షం పెద్దగా కురియలేదు. ఆదోని డివిజన్‌లో ఎక్కువ భాగం వర్షాధార భూములే వర్షం కురిస్తేనే రైతులు పొలాల్లో పనులు చేసేది. ఇంకా మండలంలోని పలు గ్రామాల్లో విత్తనం వేసేందుకు పొలాన్ని దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.



ఎండుతున్న పత్తి పంట

వర్షం కురియక పోతే ఇక అంతే



నాలుగు ఎకరాల్లో వేరుశనగ, ఉల్లి, పత్తి పంటలను సాగు చేశా. విత్తనం విత్తి వారం రోజులు అవుతోంది. ఈదురు గాలులు ఎక్కువగా ఉండటం వల్ల పొలంలోని తేమ అంతా అరిపోతోంది. ఎండ వేడిమి కూడ పెరుగుతోంది. వారంలో వర్షం కురియక పోతే పొలంలోని విత్తనాలు చీమలు తిని ఎండిపోతాయి

● రాముడు, రైతు, గంజహళ్లి

భూమిలో ఎండ వేడిమి తగ్గలేదు



గతనెలలో కురిసిన వర్షాల వల్ల అప్పట్లో భూమి చల్లబడినట్లు కనిపించిందేకాని వాస్తవానికి భూమి చల్లబడలేదు. అప్పట్లో కురిసిన వర్షాల వల్ల భూమి పదును అయింది. మరో వారం రోజుల్లో వర్షం కురియకపోతే ఇప్పటి వరకు సాగుచేసిన విత్తానాలు ఎండి పోతాయి.

● కబుల్, రైతు, గోనెగండ్ల

రైతులు ఆందోళన చెందవద్దు



సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆగస్టు నెల 15వరకు కందిని సాగు చేసుకోవచ్చు. మొక్క జొన్న పంటను జూలై 15 వరకు సాగు చేసుకోవచ్చు, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు. జిల్లాలోని రైతులు ఈ విషయాలను గమనించాలి.

● మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

తరగతులను తరలిస్తే ఊరుకునేది లేదు



వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మంత్రాలయం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మెయిన్ పాఠశాలలోకి తరలిస్తే ఊరుకునేది లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వగరూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు పిల్లలు వెళ్లలేరనీ, విద్యాధికారులు అనాలోచిత నిర్ణయాలతో మెయిన్ పాఠశాలలోకి విలీనం చేయడం బాధాకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. దళితులు చదువుకోకూడదనే ఉద్దేశంతోనే అధికారులు విద్యాధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. . కార్యక్రమంలో ఆర్‌సీ జాను, సురేష్, ఏసన్న, దిలీప్ డేవిడ్, నరసింహులు, దేవన్న, రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



రక్షణ కంచెలు ఏర్పాటు చెయకుండా వదిలేసిన సిబ్బంది

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఈ నెల 21వ తేదిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలను నాటేందుకు భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో రెండు మొక్కలు నాటించారు. మున్సిపల్ అధికారులు మరో రెండు మొక్కలు నాటారు. మిగతా మొక్కలు నాటేందుకు అవరణలో గోతులు తవ్వారు. అందులో మొక్కలు నాటకుండా అలాగే వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ప్రవేశపెట్టిన లక్ష్యాన్ని అధికారులు నీరు కారుస్తున్నారు. నాటిన మొక్కలకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో వాటిని పశువులు పీకేస్తున్నాయి.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్26(ఆంధ్రజ్యోతి): రైతుల ఆత్మహత్య నివారణకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో 8వ మండల మహాసభలను మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మయ్య, సుదర్శన్, కారన్న, వెంకటరాముడు, ఓంకారస్వామి, చంద్ర, రాజు, వీరేష్, జాఫర్‌పటేల్‌లతో పాటు నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

మంత్రాలయం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు అధ్యక్షతన మండలంలోని డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మండలంలో వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీలర్లు మహేశ్వరరెడ్డి, నాగభూషణం రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గాంధీ నాయక్, పాండురంగ, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

మంత్రాలయం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట హైవేపై రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. అక్కడే ఉన్న గ్రామస్థులు వెంకటేశ్, రాగన్న, ఇతర గ్రామస్థులు గమనించి ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్న జింకకు నీరు తాపించి పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేశారు. ఆలోపే జింక మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు మృతి చెందిన జింకను తీసుకెళ్లి పశువైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించి ఎం.తాండా ఫారెస్టులో పూడ్చి పెట్టారు.

ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంతో పాటు పట్టణంలోని అర్హులైన పేద వారు ఇంటి స్థలాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇంటి పట్టాలకు దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉండరాదన్నారు. అలాగే ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టని వైట్‌బోర్డు కలిగిన నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండరాదన్నారు. మాగాని అయితే 3.50 ఎకరాలు, వర్షాధార భూమి అయితే 10 ఎకరాలు కలిగి ఉండరాదని, విద్యుత్ బిల్లులు 300 యూనిట్లు మించరాదన్నారు. పట్టణంలోని పేదలకు 1500 చదరపు గజాల స్థలం ఉండరాదని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పరిశీలించి స్థలాలను మంజూరు చేస్తామని తెలిపారు.

ప్రిన్సిపాల్, విద్యాకమిటీ చైర్మన్ మధ్య వాగ్వాదం

గోనెగండ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ షహనాపర్వీన్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్ మధ్య విద్యార్థుల సీట్ల ఎంపిక విషయంలో గురువారం తీవ్రస్థాయిలో వాగ్వదం జరిగింది. వారి మధ్య మాటకు మాట పెరగడం వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో చైర్మన్ రాజీనామకు సిద్ధపడ్డాడు. కొందరు చైర్మన్‌ను వారించారు. మోడల్ స్కూల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చైర్మన్ ఆరోపించారు.

మెరిట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం

మెరీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిస్వామి, ఆర్‌యూఎస్ఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రఘునాథ్, అఫ్రిద్ అన్నారు. గురువారం మోడల్ పాఠశాల ముందు కొంత సేపు బైటాయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మెరిట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న గోనెగండ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సీట్ల సర్దుబాటు విషయంలో ప్రిన్సిపల్ అవకతవకలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ఎక్కువ మార్కులు వచ్చిన వారిని కాదని తక్కువ మార్కులు వచ్చిన వారికి సీట్లు కేటాయించారని వారు తెలిపారు.

ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తాను

మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ షహనా పర్వీన్, పాఠశాల చైర్మన్ గౌస్ మధ్య వాగ్వాదం గురించి నాకు సమాచారం లేదు. నా దృష్టికి వస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తాను

- రామాంజనేయులు, ఎంఈవో, గోనెగండ్ల

డిమాండ్లు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 26 : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశులు, నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, భాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు అంబారీపై ప్రహ్లాదరాయలు



రజత గజవాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారీపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం ఆషాడశుద్ధ పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారీలో ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

రామన్న గౌడ్‌కు ఘన నివాళులు



రామన్న గౌడ్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 26 : చంద్ర పుల్లారెడ్డితో కలసి విప్లవపోరాటాలలో పాల్గొని అమరుడు అయిన రామన్న గౌడ్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం తాలుకా నాయకులు కే జయన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనిఫ్ పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దైవందిన్నె గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో పుట్టి సామాన్య కార్యకర్తగా విప్లవ పోరాటాలలో పాల్గొని రాష్ట్ర అధ్యక్షుడిగా నాయకత్వ బాధ్యతలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో కిరణ్, విజయ్, బాలు, శివన్న పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన, పొందుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 12 చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు. గురువారం పట్టణంలోని కుర్ణి కమ్యునిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మిగనూరు పట్టణం, మండలం, గోనెగండ్ల, నందవరం మండలాలకు చెందిన 12 మందికి రూ. 9,84,058 చెక్కులను అందజేశారు. సీఎం సహాయనిధి కింద బాధితులకు సాయం చేసిన సీఎంకు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, కాశీం వలి, చిన్నరాముడు, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి, బండప్ప స్వామి, ధర్మాపురం గోపాల్, జబ్బార్, మహేష్, ఫారుక్, సోగనూరు జగదీష్, డబ్బా ఈరన్న, రాఘవేంద్ర, వినయ్, సుధీర్,వీరేష్ పాల్గొన్నారు.

కలుగొట్ల గ్రామాధ్యక్షుడి ఎన్నిక: మండలపరిధిలోని కలుగొట్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొండన్న గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని కుర్ణి కమ్యునిటీ హాల్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో జరిగిన గ్రామకమిటీ నియామక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రామలింగడు, శంకర్‌గౌడ్, నరసన్నగౌడ్, రాముడు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పెట్టే జీవోలు రద్దు చేయాలి

మంత్రాలయం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యను దూరం చేసే జీవోనెంబర్లు 102, 103, 104లను రద్దు చేసి పాత విద్యావిధానాల్లోనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ అన్నారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అరుణాచారి, వీరేష్, దివాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆవు ప్రాణాలు కాపాడిన వైద్యులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 26 : పట్టణంలోని 21వ వార్డులో గాయత్రి ఆలయం దగ్గర ఓ వీధి ఆవు ప్రసవ వేదనతో విలవిలాడింది. ప్రసవం కాక విలవిలాడుతూ రోడ్డుపై కొట్టుమిట్టాడుతుండగా దీన్ని గమనించిన వార్డు కౌన్సిలర్ దయాసాగర్ వెంటనే పశు వైద్యులకు, పశు సంవర్థక శాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని ఆవును పరిశీలించారు. ఆవు ప్లాస్టిక్, చెత్తను తినడంతో గర్భంలో ఉన్న దూడకు ఊపిరి అడక చనిపోయిందని గుర్తించి, ఆవుకు సిజేరియన్ చేసి దూడను బయటికి తీసి తల్లి ప్రాణాలు కాపాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర వీరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పది ఆటోలు సీజ్.. కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పది ఆటోలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలిగిస్తుండటం, ఆటోలను సీజ్ చేసి ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆటో డ్రైవర్లు ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ గ్రామ కమిటీల ఎన్నిక

నందవరం, జూన్ 26(ఆంధజ్యోతి): మండల కేంద్రమైన నందవరం, రాయచోటి గ్రామాల్లో సీపీఐ గ్రామ కమిటీలు ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సోమేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం అయా గ్రామాల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

● ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినం
● నియోజకవర్గ వ్యాప్తంగా ర్యాలీలు అవగాహన సదస్సులు



ఎమ్మిగనూరులోప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, పోలీసులు



మంత్రాలయంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి



ముగతిలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమరవాణా వ్యతిరేకదినోతవాన్ని పురస్కరించుకుని డీఎస్పీ ఉపేంద్ర బాబు, ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, పట్టణ సీఐ శ్రీనివాసులు, రూరల్ సీఐ మధుసూదన్ , ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, ఇస్మాయిల్, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయం: యువత మాదక ద్రవ్యాల మాయలో పడి తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని, వీటి నుంచి బయట పడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి రాఘవేంద్రస్వామి మఠం ముఖద్వారం మీదుగా అంబేడ్కర్ సర్కిల్ తహసీల్దార్ కార్యాలయం మీదుగా రాఘవేంద్ర సర్కిల్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజు, మేకల నరసింహులు, భీమిరెడ్డి, శివ, నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రమేష్, లెక్చరర్లు వెంకటస్వామి, మద్దిలేటి, భీమయ్య రాగన్న తదితరులు పాల్గొన్నారు.



కోసిగి సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

నందవరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గురువారం నందవరం మండలం ముగతి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. సమావేశంలో ఎస్ఐ కేశవ్, ఏఎస్ఐ నటరాజ్, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కోసిగి: అంతర్జాతీయ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కోసిగిలో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి, కోసిగి సీఐ మంజునాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు కార్తిక్ సాగర్, నాగేంద్ర, పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది కిషోర్, మునిరంగడు, భరత్, తిక్కయ్య, రవి, విద్యార్థులు ఉన్నారు.